కోలాహలంగా.. జగనన్నే మా భవిష్యత్

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో 'జగనన్నే మా భవిష్యత్', 'మా నాయ్మకం నువ్వే జగన్' కార్యక్రమం కోలాహలంగా జరుగుతోంది. పట్టణంలో వార్డుల వారీగా సచివాలయాల కన్వీనర్లు (జేసీఎస్) ఆధ్వర్యంలో గృహకన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని, సమస్య లేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. లబ్ధిదారుల అనుమతితోనే వారి ఇంటికి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికిస్తున్నారు. లబ్ధిదారులు స్వచ్ఛందంగా తమ ఇళ్ల గోడలకు స్టిక్కర్లను అతికించాలని కోరుతున్నారు. టూటౌన్‌లో 32 వార్డులో జేసీఎస్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు (తాతారాజు) గృహసారథులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో సంక్షేమ పథకాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా పేదలకు చేస్తున్న మేలును వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పనిచేస్తున్నారన్నారు. తాతారాజు వెంట గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే 9వ వార్డులో జేసీఎస్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాష్ గృహసారథులు, పార్టీనాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి జగనన్న మా భవిష్యత్ స్టిక్కర్లు అతికించి లబ్ధిదారులతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ వేంద్ర విజయదుర్గ, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. మూడో వార్డులో కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాస్ గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అతికించి లబ్ధిదారులతో సంక్షేమ పథకాలపై మాట్లాడారు. భవిష్యత్‌లో కూడా జగనన్న మరింత సంక్షేమం అందిస్తారని, పేదలకు తోడుగా ఉంటారని వివరించారు. ఆయన వెంట పూరి సూరిబాబు, సోరపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు బాసటగా నిలవాలి

వీరవాసరం: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలను మండల వ్యాప్తంగా సోమవారం నాలుగో రోజు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో కోలాహలంగా వాడవాడల కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంతా బాసటగా నిలవాలని కోరారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు గ్రామ గ్రామాన ప్రజలంతా మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఇంటింటికి వెళ్లి వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని పేర్కొన్నారు. వీరవాసరంతో పాటు రాయకుదురు, కొణితివాడ, మడుగు పోలవరం, నేలపోగుల, బలుసుగొయ్యిపాలెం, తోలేరు, అండలూరు, నవుడూరు, పంజా వేమవరం, చింతలకోటి గరువు, వీరవల్లివారి పాలెం, తోకలపూడి, వడ్డిగూడెం, మత్స్యపురి, మత్స్యపురిపాలెం, నందమూరి గరువు ,పెరికిపాలెం, బొబ్బనపల్లి, మెంటేపూడి తదితర గ్రామాల్లో కార్యక్రమాలను గ్రామ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, ఇళ్ల పూర్ణ బాలభారతి, గడ్డం భారతి ,చికిలే మంగతాయారు, పంజా ప్రసాదు, బీశెట్టి లక్ష్మి, నేతల జ్ఞానసుందరరాజు, గడ్డం భాస్కరరావు, పంజా జానకిరామయ్య, బొల్లంపల్లి శ్రీనివాస్‌చౌదరి, నూకల కనకారావు, వేగేశ్న వర్మరాజు, నాగరాజు శ్రీనివాసరాజు, కోడే అప్పారావు, కోడే లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భీమవరం 9 వార్డులో ఓ ఇంట్లో స్టిక్కర్ అతికిస్తున్న జేసీఎస్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాష్

ఉండి మండలంలో అపూర్వ స్పందన

ఉండి: జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. సోమవారం మండలంలో ఉండి, ఉణుదుర్రు, అర్తమూరు, ఉప్పులూరు, పాములపర్రు తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఐదు ప్రశ్నలతో కూడి ప్రశ్నాపత్రంతో ప్రజల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఉండి సర్పంచ్ కమతం సౌజన్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు కరిమెరక చంద్రరావు, జీ సుందర్‌కుమార్, జిల్లా నాయకులు యేడిద వెంకటేశ్వరరావు, కమతం బెనర్జీ,అంగర రాంబాబు,కరిమెరక శివ నాగరాజు,బడుగు బాలాజీ,శేషాద్రి శ్రీను,పట్టణాధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జున తదితరులు మాట్లాడుతూ నూటికి నూరు శాతం సర్వేకు అనుకూలంగా మాట్లాడారన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ పాలన బాగుందని ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ ఏదోక సంక్షేమ పథకాన్ని అందిస్తూ ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ఆడపడుచులు జగనన్నను గెలిపించుకుని తీరతామని చెబుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న స్టిక్కర్‌ను అడిగి మరీ అతికించుకుంటున్నారని అన్నారు. సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మీ, ఎంపీటీసీ అల్లూరి మాధవి, నిమ్మల కేశవకుమార్, వర్రే పైడియ్య పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో సంతృప్తి

పాలకోడేరు: మండలంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు ఆధ్వర్యంలో గృహ సారథులు, కన్వీనర్లు పలు కుటుంబాలను కలుసుకున్నారు. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలను, లబ్ధిని వివరించారు. పలు కుటుంబాలు గతంలో జన్మభూమి కమిటీలు చెబితేనే ఏదైనా చేసేవారని, ఇప్పుడు అసలు రాజకీయ జోక్యం లేకుండా పథకాలు అమలు జరుగుతున్నాయని అధిక శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే వలంటీర్లు పింఛను సొమ్ము అందజేస్తున్నారని వృద్ధులు, మహిళలు, వికలాంగులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమం కోసమే సీఎం జగన్ పాలన

భీమవరం అర్బన్: ప్రజల సంక్షేమం కోసమే సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల సత్యనారాయణ రాజు (ధర్మరాజు) అన్నారు. చినఅమిరంలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలలో భాగంగా సోమవారం గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి జగన్ పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ ధర్మరాజు మాట్లాడుతూ నవరత్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు చిల్లిముంత పార్వతి, గొట్టుముక్కల పద్మరాజు, చిల్లిముంతల శ్రీనివాస్, లక్ష్మీపతి రాజు, యాళ్ల సుధీర్, బుంగానాగేశ్వరరావు, శనపతి శ్రీను, ఏ మారుతీరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ చాపాని శివగణేష్, బండారు సీతయ్య, జె ప్రకాష్ పాల్గొన్నారు.


చినఅమిరంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మాజీ సర్పంచ్ ధర్మరాజు


బలుసుగొయ్యిపాలెంలో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న నాయకులు


ఉండిలో సర్వే నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మోగల్లులో ఓ ఇంట్లో స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు

క్లుప్తంగా

మోషేన్‌రాజును కలిసిన జయమంగళ


భీమవరంలో మోషేనురాజును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

సాక్షి, భీమవరం: శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును భీమవరంలో సోమవారం ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన జయమంగళ వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజును శాలువతో సత్కరించారు.

పండ్లు, రొట్టెల పంపిణీ


ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

భీమవరం (ప్రకాశం చౌక్): ఈస్టర్ పండుగను పురస్కరించుకుని భీమవరం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు, రోగులకు, ఏఆర్‌టీ సెంటర్ హెచ్‌ఐవీ పేషేంట్లుకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూపీఏ అధ్యక్షులు పాస్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వీరాస్వామి, ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు డాక్టర్ ఎం.గోవిందుబాబు, యూపీఏ ఉపాధ్యక్షులు శ్రీపాల్, సెక్రటరీ సతీష్‌పాల్, సభ్యులు బాలం ప్రసాద్, యోహను పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ డీఎస్పీకి వినతి


డీఎస్పీ శ్రీనాథ్‌తో మాట్లాడుతున్న క్రిస్టియన్ నాయకులు

ఉండి: చెరుకువాడలో సమస్యాత్మకంగా మారిన చర్చి నిర్మాణంపై సరైన న్యాయం చేయాలని ఏఐఎఫ్ఎఫ్‌సీఐ(ఆల్ ఇండియా ఫ్రీడం ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రిటీ) నాయకులు డీఎస్పీ బి.శ్రీనాథ్‌ను కోరారు. ఇంటిగ్రిటీ జాతీయ అధ్యక్షుడు పీటర్ పుట్టా, రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, మత్తి రాజ్‌కుమార్, పాస్టర్ కన్నిడి హేమ్‌కుమార్ తదితర నాయకులు సోమవారం ఉండి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. చర్చి నిర్మాణం చేపట్టేలా న్యాయం చేయాలని కోరారు. డీఎస్పీ మాట్లాడుతూ చట్టవ్యతిరేకంగా గాని శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గాని ఎక్కడా కార్యక్రమాలు నిర్వహించరాదని, సమస్య పరిష్కారం కొరకు శాంతియుతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచించారు.

దళితవాడల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ఆకివీడు: దళిత వాడల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు నూరు శాతం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయకోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, నన్నేటి నాగరాజు, జొన్నల వజ్రం, తొర్లపాటి భాగ్యరాజ్ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి సర్వేయింగ్ కీలకపాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న జగపతిరాజు

సాక్షి, భీమవరం: దేశ, పారిశ్రామిక ప్రగతికి సర్వేయింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో సోమవారం సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, భీమవరం లోకల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సర్వేయింగ్‌లో చైన్ సర్వే నుంచి డ్రోన్ సర్వే వరకు ఎన్నో వినూత్నమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేయింగ్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. సర్వేయింగ్‌లో నూతన టెక్నాలజీని అధ్యయనం చేసి త్వరితగతిన సర్వే పూర్తి చేసేలా అధ్యయనం చేయాలని సూచించారు. కె.బ్రహ్మరాజు, ఏసీఎస్‌వీ ప్రసాద్, లోకల్ సెంటర్ చైర్మన్ కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు కోపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కోపల్లెలో మంగళవారం నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోమవారం చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ టీఏల నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్స్ (టీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం భీమవరంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా లంకపల్లి ఒమెగరాజు, ప్రెసిడెంట్‌గా కమ్ముల సుధీర్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా గుత్తుల ప్రవీణ్‌కుమార్, సెక్రటరీగా మణికంఠ విజయకుమార్, ట్రెజరర్‌గా వీరా సుదర్శన్‌కుమార్ ఎన్నికయ్యారు.

లెక్కల పరీక్షకు 9 మంది గైర్హాజరు


కోపల్లెలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కాళ్ల: పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన గణితం పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ఎ.రవీంద్ర చెప్పారు. కాళ్ల హైస్కూల్లో 213 మందికిగాను ఒక విద్యార్థి, కోపల్లెలో 228 మందికి గాను ముగ్గురు, కలవపూడిలో 100 మందికి గాను నలుగురు, ఏలూరుపాడు జడ్పీ హైస్కూల్లో 177 మందికిగాను ఒక విద్యార్థి చొప్పున మొత్తం 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. మండలం మొత్తం 718 మంది హాజరు కావాల్సి ఉండగా 709 మంది మాత్రమే లెక్కలు పరీక్ష రాసినట్లు వివరించారు.

శృంగవృక్షం హైస్కూల్ తనిఖీ

పాలకోడేరు: రాబోయే విద్యా సంవత్సరానికి పంపిణీ చేసే జగనన్న విద్యా కానుక కిట్లను సిద్ధం చేయడం జరిగిందని జేవీకే ఏఎస్‌పీ శ్యామ్‌సుందర్ సోమవారం చెప్పారు. కిట్లను భద్రపరిచేందుకు మండలంలోని శృంగవృక్షం హైస్కూల్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు జేవీకే బృందం ఈ పాఠశాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

జగన్ పాలనలోనే పేదల అభివృద్ధి

ఆకివీడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ పాలనపై ప్రతి ఇంటి నుంచి విశేష స్పందన వస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. పట్టణంలోని సచివాలయం–3లోని ఐదో వార్డులో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పీవీఎల్ అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, చేయూత, ఆసరా వంటి పథకాలతో పాటు ఇళ్ల స్థలాలు, ఇంటి రుణాలు మంజూరు అయ్యాయని అధిక శాతం మంది ప్రజలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు భవిష్యత్ తరానికి ఎంతో మేలు చేకూరుస్తాయన్నారు. సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణంతో లక్షాధికారులవుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు ఒకొక్క ఇంటిలో రూ.లక్ష నుంచి రూ.6 లక్షలకు పైగా సొమ్ము అందిందని చెప్పారు. పిల్లల భవిష్యత్‌కు సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. స్థానిక సాయినగర్‌లో 20 ఏళ్ల గడిచినా కాలనీలో రోడ్లు నిర్మించలేదని ఆ ప్రాంత మహిళలు పీవీఎల్ దృష్టికి తీసుకువచ్చారు. మట్టి రోడ్లపై నడుస్తున్నామన్నారు. గతంలో ఎమ్మెల్యేగా సర్రాజు పనిచేసినప్పుడు గ్రావెల్ రోడ్లు వేశారని, అవి కూడా పూర్తిగా పాడైపోయాయన్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేదని చెప్పారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో సర్వీసులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. కాలనీలో లేఅవుట్ అప్రూవల్ అవ్వలేదని, దీనివల్లే సమస్య తలెత్తుతుందన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు ఆ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని పీవీఎల్ చెప్పారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, డైరెక్టర్లు జగ్గురోతు విజయ్‌కుమార్, మేకా పార్వతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, జీ.ధనరాజు, మోటుపలి గంగాధరరావు, నంద్యాల సీతారామయ్య, శిరపు శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ తిరుమానేని మాధవి, నాగరాజు, శ్రీహరి పాల్గొన్నారు.


ఆకివీడు సాయినగర్‌లో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న పీవీఎల్

క్యాంటీన్ ప్రారంభించిన కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టరేట్ ఆవరణలో ఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో తాడేరుకు చెందిన ఏసు స్వయం సహాయక సంఘం డ్వాక్రా మహిళలతో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యానికి మేలు చేసే ఆర్గానిక్ ఉత్పత్తులు, చిరుధాన్యాలతో చేసిన ఐటమ్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టరేట్ శాఖల్లో సమీక్ష సమావేశాలు, చిన్న చిన్న సమావేశాలు జరిగినప్పుడు ఈ క్యాంటీన్ నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసి మహిళా సంఘాల సభ్యులకు చేయూతనివ్వాలని అధికారులకు సూచించారు. డీఆర్ డీఏ పీడీ వేణుగోపాల్, సమాచార శాఖ ఏడీ దాసరి నాగార్జున, డ్వామా పీడీ రాజేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి ఎ.దుర్గేష్, సీపీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

చినకాపవరంలో రంగా విగ్రహావిష్కరణ

ఆకివీడు: పదవితో కాదు, ప్రజాభిమానంతో గుర్తింపు పొందిన వ్యక్తి స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. చినకాపవరంలో రంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి దూరమైతే వారం రోజుల్లో మరిచిపోయే రోజులని, 34 ఏళ్లు భౌతికంగా లేకపోయినా ప్రజల మనస్సుల్లో ఆయన గూడు కట్టుకున్నారని రాధా చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడి, వారి అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిల విఠల్, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, నాతిరెడ్డి అన్నవరం, అల్లాడి బాబ్జీ, రంగా యూత్ పాల్గొన్నారు.

గడపగడపకు అభివృద్ధి పనులు ప్రారంభం

ఆకివీడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల్ని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తూ, వాటి ప్రారంభోత్సవాల్ని చేయడంతో ప్రజలు ఆనందిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలోని అంకోడు దళితవాడ, శివపార్వతీపురం శివారు గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లను సోమవారం పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలు నిధులు తక్షణం మంజూరు అవుతున్నాయని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తదితర అత్యవసర పనుల్ని చేపట్టామన్నారు. ఏళ్ల తరబడి రోడ్లకు నోచుకోని కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. పార్టీ నాయకుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ అంకోడు దళితవాడ, శివపార్వతీ పురం ప్రాంతాలు పంట పొలాలుగా ఉన్నాయని, వాటిలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చి 15 ఏళ్ల గడచినా రోడ్లు నిర్మించలేదన్నారు. నిధుల వెసులుబాటును బట్టి ప్రాధాన్యతా క్రమంలో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తామన్నారు. సర్పంచ్ ముత్యాల అనురాధ, శివన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు బంటుమిల్లి పుణ్యవతి పాల్గొన్నారు.


కుప్పనపూడిలో రోడ్ల అభివృద్ధి పనుల్ని ప్రారంభిస్తున్న పీవీఎల్, యండగండి శ్రీను

రైతు అభివృద్ధే ధ్యేయం

ఉండి: రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని చిలుకూరు గ్రామ సర్పంచ్, రైతు ముదునూరి వెంకటసోమరాజు అన్నారు. సోమవారం చిలుకూరు ఆర్‌బీకే వద్ద ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న రెండు పవన్ టిల్లర్‌లను సర్పంచ్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సహకారంతో గ్రామంలో పవర్ టిల్లర్లు అందించామన్నారు. వ్యవసాయంలో సాంకేతికతను జోడించడంతో రైతులకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా వస్తుందని అన్నారు. ఏఓ బి.సంధ్య మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు సబ్సిడీపై పవర్ టిల్లర్‌లు, కోత మిషన్లు, ట్రాక్టర్లు అందిస్తున్నామన్నారు. సోమవారం చిలుకూరు, మహదేవపట్నం, ఉండి, యండగండి గ్రామాల్లో 4 సీహెచ్‌సీ గ్రూపులకు గాను 13 పవర్ టిల్లర్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ మొహమ్మద్ షాహినీ, పంచాయతీ కార్యదర్శి ఎం సాత్వీకం, వీఏఓ టీ ఝాన్సీ భవానీ పాల్గొన్నారు.


చిలుకూరులో రైతులకు పవర్ టిల్లర్లు అందిస్తున్న సర్పంచ్ సోమరాజు, ఏఓ సంధ్య

మే 28 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు

సాక్షి, భీమవరం: భీమవరంలో మే 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికే నూతన జాతీయ విద్యా విధానం తీసుకొస్తున్నారని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ విద్యా రంగాన్ని పేద వర్గాలకు దూరం చేయడానికే ఎన్ఈపీ విద్యావిధానాన్ని తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్లబోయిన రంగారావు, ఏఐఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్, టి.అప్పలస్వామి, సుందర్, యు.మురళీ, కె.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ

ఆకివీడు: స్థానిక గాలిబ్ చెరువు వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సోమవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో పట్టణం, సమీప గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. రూ. 2.50 లక్షల వ్యయంతో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో 5ఎంవీ మెగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారన్నారు. ఆక్వా, గృహావసరాలకు, వ్యాపార, చిన్న పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని చెప్పారు. కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో 5ఎంవీ సబ్ స్టేషన్ నిర్మాణం వేగంగా జరుగుతుందని పీవీఎల్ చెప్పారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి, కేశిరెడ్డి మురళీ, మోటుపల్లి గంగాధరరావు, శిరపు శ్రీనివాస్,పడాల శ్రీనివాసరెడ్డి, ఎండీ.జక్కీ, అందేరాజబాబు, కఠారి కేశవరావు, కౌన్సిలర్లు, విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్,ఏడీఈ రాంబాబు, ఏఈ ప్రసాదరాజు, కనస్ట్రక్షన్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ దివాకర్, లైన్‌ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ కోర్సు శిక్షణ

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల వ్యవధిలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాంకు డిగ్రీ, డేటా ఎంట్రీ కోర్సుకు 10వ తరగతి, బ్యూటీ కోర్సు(మహిళలు)కు 5వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. 90 శాతం హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.